సాక్షి చిత్తూరు

మంగళవారం। 28। మే। 2024



'జైన్ ఫార్మ్'లో ఐఎఫ్‌సీ బృందం

జీడీ నెల్లూరులోని జైన్ ఫార్మ్ గుజ్జు పరిశ్రమను సోమవారం ఐఎఫ్‌సీ బృందం సందర్శించింది. - 8లో



మృత్యు 'నిద్ర'

చంద్రగిరి మండలం ఏ.కొంగరవారిపల్లె వద్ద సోమవారం వేకువజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. - 8లో



అలరించిన 'ఇలావంతుని బలి'

గుడుపల్లె మండలం యామగానిపల్లెలో ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. - 8లో

అమ్మకు ఆపరేషన్



కాసుల కోసం ప్రైవేట్ ఆస్పత్రులు కక్కుర్తిపడుతున్నాయి. మాఫియాగా మారి డబ్బుల కోసం కడుపు కోతలకు తెగబడుతున్నాయి. సుఖ ప్రసవాలను పక్కనపెట్టి సిజేరియన్‌కు మొగ్గుచూపుతున్నాయి. అవసరం లేకపోయినా గర్భిణులను భయపెట్టి యథేచ్ఛగా ఆపరేషన్ చేసేస్తున్నాయి. కాన్పుకు వచ్చిన వారిని అందినకాడికి దోచుకుంటున్నాయి. ఈ క్రమంలో అడ్డగోలు దోపిడీకి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. నార్మల్ డెలివరీకి అవకాశమున్నా నిబంధనలకు విరుద్ధంగా శస్త్రచికిత్సకు ప్రాధాన్యమిస్తున్న పలు హాస్పిటళ్లకు నోటీసులు జారీ చేసింది. తీరు మారకుంటే అనుమతులు రద్దు చేస్తామని హెచ్చరించింది.



చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో ప్రసవ వార్డు (ఫైల్)

భయపెట్టి 'కోత'

గతంలో అధిక శాతం నార్మల్ డెలివరీస్ జరిగేవి. రానురాను పరిస్థితి మారుతూ వస్తోంది. ప్రైవేట్ ఆస్పత్రుల సంఖ్య పెరిగిపోయింది. అత్యాశతో పలు ప్రైవేట్ ఆస్పత్రుల నిర్వాహకులు వికృత క్రీడకు తెరతీస్తున్నారు. డెలివరీ కోసం ఆస్పత్రికి వచ్చిన వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. బ్లడ్ తక్కువగా ఉందని, బిడ్డ సరిగా లేదని, అడ్డంగా తిరిగిందని, ఉమ్మ నీరు తక్కువగా ఉందని, సీరియస్‌గా ఉందని చెప్పి భయపెడుతున్నారు. నార్మల్ డెలివరీకి అవకాశం లేదని, అలా చేస్తే తల్లీబిడ్డ ఇద్దరి ప్రాణానికి ప్రమాదమని మభ్య పెడుతున్నారు. సీజేరియన్ అయితే ప్రమాదం తప్పి బయట పడొచ్చని మాయమాటలు చెబుతున్నారు. దీంతో కుటుంబ సభ్యులు సైతం ఆపరేషన్‌కే మొగ్గుచూపుతున్నారు.

- జిల్లాలో పెరుగుతున్న సిజేరియన్లు
- తల్లులకు తప్పని కడుపు కోత
- కాన్పుల పేరుతో ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడీ
- సుఖ ప్రసవం చేయకుండా శస్త్రచికిత్సలు
- అక్రమాల కట్టడికి చర్యలు చేపట్టిన వైద్యశాఖ అధికారులు
- పలు హాస్పిటళ్లకు నోటీసులు

కాణిపాకం : జిల్లాలో 2 వేలకు పైగా వేట్ ఆస్పత్రులు ఉన్నాయి. ఇందులో ప్రసవాలు చేసే ఆస్పత్రులు సుమారు 300 వరకు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దాదాపు అన్నింటిలోనూ సిజేరియన్లు చేస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఎప్పుడో ఒకసారి నార్మల్ డెలివరీ చేస్తూ.. ఎక్కువగా ఆపరేషన్‌లే చేస్తున్నారు. మంచి ముహూర్తం చూసుకుని కొందరు ఇష్టపూర్వకంగా సిజేరియన్ చేయించుకుంటుండగా, మిగిలి వారికి ఆస్పత్రుల వారే పైసల కోసం అడ్డగోలుగా కడుపులు కోసేస్తున్నారు. సాధారణ ప్రసవాలకే పెద్దపీట వేయాలని అధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నా ఆస్పత్రుల నిర్వాహకులు మాత్రం పట్టించుకోవడంలేదు.

జిల్లాలో కాన్పుల సమాచారం

	ప్రభుత్వ ఆస్పత్రుల్లో			ప్రైవేటు ఆస్పత్రుల్లో		
	సాధారణ ప్రసవం	సిజేరియన్	మొత్తం	సాధారణ ప్రసవం	సిజేరియన్	మొత్తం
జనవరి	708	197	905	674	263	937
ఫిబ్రవరి	523	165	688	667	243	910
మార్చి	637	201	838	364	284	648
ఏప్రిల్	462	174	636	326	237	563
మొత్తం	2,330	737	3,067	2,031	1,027	3,058

ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణమే లక్ష్యం

జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మాత్రం సాధారణ ప్రసవాలే లక్ష్యంగా ముందుకు వెళుతున్నారు. ఇక తప్పని పరిస్థితుల్లో మాత్రమే సిజేరియన్‌కు సిఫార్సు చేస్తున్నారు. ఈ క్రమంలోనే ప్రభుత్వం సైతం సాధారణ ప్రసవాలే జరగాలని ఆదేశాలు జారీ చేసింది. నిబంధనలు అతిక్రమిస్తే ఎప్పటికప్పుడు చర్యలకు ఉపక్రమిస్తోంది. ఈ మేరకు ప్రభుత్వాస్పత్రుల్లో అన్ని రకాల వసతులు కల్పించింది. 24గంటలూ వైద్యులను అందుబాటులో ఉంచుతోంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు సైతం నిరంతరం పనిచేసేలా జాగ్రత్తలు తీసుకుంది. ఈ మేరకు సాధ్యమైనంత వరకు సుఖ ప్రసవాలు చేయాలని స్పష్టం చేసింది. నిరంతరం గర్భిణీలను పర్యవేక్షిస్తోంది. తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ సేవలను గర్భిణీలు సద్వినియోగం చేసుకునేలా చూస్తోంది. హైరిస్క్ కేసులకు మెరుగైన వైద్యం అందించి సుఖ ప్రసవం చేయడమే లక్ష్యంగా చర్యలు చేపట్టింది. ఫలితంగా ప్రభుత్వ వైద్యశాలల్లో సాధారణ ప్రసవాలు గణనీయంగా పెరిగాయి.

సుఖ ప్రసవంతో..

సుఖ ప్రసవంతో మహిళల శరీరం ఆరోగ్యంగా ఉంటుంది. రెండో పర్యాయం కూడా సాధారణ కాన్పు అయ్యే అవకాశం ఉంటుంది. పుట్టిన బిడ్డకు మదర్ ఫీడింగ్ ఎక్కువగా ఉంటుంది. దీంతో తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారు. ఇన్ఫెక్షన్లు తక్కువగా వస్తాయి.

ఆరోగ్యంపై ప్రభావం

ప్రైవేట్ ఆస్పత్రుల్లో సిజేరియన్లు చేస్తుండటంతో తల్లి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. కడుపు కోయడంతో కుట్ల దగ్గర గాయం మాని మాని, సాధారణ స్థితికి రావడానికి కనీసం నెల నుంచి రెండు నెలల సమయం పడుతుంది. ట్యాబ్లెట్స్, ఇంజెక్షన్లు వాడాలి. దీని ఎఫెక్ట్ పుట్టిన బిడ్డపై కూడా ఉంటుంది. తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది. రెండోసారి కాన్పు కూడా ఆపరేషన్ చేయడం తప్పనిసరిగా మారుతుంది. దీంతో తల్లికి మరింత ఇబ్బంది తప్పదు. దీంతోపాటు సిజేరియన్ అంటే ఆస్పత్రులకు రూ.వేలకు వేలు డబ్బులు ముట్టజెప్పాల్సిందే. సాధారణ ప్రసవాలతో పోలిస్తే సిజేరియన్లకు డబుల్ వసూలు చేస్తారు. సాధారణ ప్రసవానికి రూ. 30వేలు ఉంటే.. సిజేరియన్‌కు రూ. 80వేల దాకా దండుకుంటున్నారు.



చిత్తూరు జిల్లా ప్రభుత్వాస్పత్రిలో గర్భిణులను పరీక్షిస్తున్న వైద్యులు (ఫైల్)

పలు ఆస్పత్రులకు నోటీసులు...

జిల్లాలో అడ్డగోలుగా సిజేరియన్లు చేస్తున్న ఆస్పత్రులను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు గుర్తించారు. ఈ మేరకు ఆయా ఆస్పత్రుల యాజమాన్యాలకు నోటీసులు జారీ చేశారు. వారిపై పూర్తి స్థాయిలో నిఘా పెట్టారు. ఇకపై సుఖ ప్రసవాలపై దృష్టిసారించాలని, అనవసరంగా సిజేరియన్ చేయవద్దని హెచ్చరికలు జారీ చేశారు. మార్పు రాని పక్షంలో లైసెన్స్‌లు రద్దు చేసేందుకు వెనకాడబోమని స్పష్టం చేశారు.

అవసరమైతేనే..



"గర్భిణీలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. మెరుగైన వైద్య సేవలు అందిస్తోంది. సుఖ ప్రసవాలకు ప్రాధాన్యమిస్తోంది . సిజేరియన్లను తగ్గించి, సాధారణ కాన్పుల సంఖ్యను పెంచాలని చూస్తోంది. అవసరమైతే తప్ప సిజేరియన్ చేయకూడదని ఇప్పటికే ప్రైవేట్ ఆస్పత్రులను హెచ్చరించాం. అనవసరంగా చేస్తే అందుకు బాధ్యత వహించాలని స్పష్టం చేశాం. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు.

– ప్రభావతీదేవి, డీఎంహెచ్‌ఓ, చిత్తూరు

న్యూస్‌రీల్

పటిష్టంగా 'బారికేడింగ్'



అధికారులకు సూచనలిస్తున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్ : కౌంటింగ్ కేంద్రంలో బారికేడింగ్ పటిష్టంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశించారు. సోమవారం చిత్తూరు సమీపంలోని ఎస్వీసెట్ ఇంజినీరింగ్ కళాశాలలో కౌంటింగ్ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. జేసీ మాట్లాడుతూ కౌంటింగ్ కేంద్రంలో స్ట్రాంగ్ రూముల నుంచి కౌంటింగ్ హాల్‌కు ఈవీఎంలను తీసుకెళ్లేందుకు ప్రత్యేకంగా బారికేడింగ్ ఏర్పాటు చేయాలన్నారు. స్ట్రాంగ్ రూముల వద్ద మూడంచెల భద్రత కల్పించినట్లు తెలిపారు. అసెంబ్లీ నియోజకవర్గాలు, పార్లమెంట్ సెగ్మెంట్‌కు ప్రత్యేకంగా కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఏజెంట్లు వెళ్లేందుకు ప్రత్యేకంగా బారికేడ్లు ఉంటాయని వివరించారు. ఓట్ల లెక్కింపు చేపట్టే ప్రాంతాలలో సీసీ కెమెరాలు, కంట్రోల్ రూమ్‌లో టీవీలను ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ పుల్లయ్య, ఆర్‌ఓలు చిన్నయ్య, వెంకటరెడ్డి, ఇతర శాఖల అధికారులు ఉమామహేశ్వరరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

65 మంది ఉద్యోగుల సస్పెన్షన్

చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల పోలింగ్ విధులకు హాజరుకాని 65 మంది ఉద్యోగులను సస్పెండ్ చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్ వెల్లడించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఈ నెల 13వ తేదీన పోలింగ్ విధులను పలు శాఖల ఉద్యోగులకు కేటాయించామన్నారు. పోలింగ్ విధులకు హాజరుకాని 228 మందికి ఇప్పటికే షోకాజ్ నోటీసులు జారీచేశామని తెలిపారు. షోకాజ్ నోటీసులు జారీచేసిన వారిలో కొంత మంది ఎన్నికల విధుల్లో పాల్గొన్నట్లు, మరికొందరు రాత పూర్వకంగా సంజాయిషీ ఇచ్చారని వివరించారు. అయితే సంతృప్తికరంగా సంజాయిషీ ఇవ్వని 65 మంది ఉద్యోగులపై వేటు వేసినట్లు ఎన్నికల అధికారి స్పష్టం చేశారు.

కాలువ కబ్జాకు చెక్



కాలువను పరిశీలిస్తున్న తహసీల్దార్ ఆల్‌ఫ్రెడ్

శ్రీరంగరాజపురం: మండలంలోని ములూరు చెరువు నుంచి వచ్చే కుబేరు వంకను మూలూరుకి చెందిన అంకిరెడ్డి కబ్జా చేశారు. ఈ మేరకు సోమవారం కాలువను చదును చేసేందుకు యత్నించారు. దీనిపై సమాచారం అందుకున్న తహసీల్దార్ ఆల్‌ఫ్రెడ్ హుటాహుటిన గ్రామానికి చేరుకుని కాలువను చదును చేస్తున్న ఒక హిటాజీ, 4 ట్రాక్టర్లను సీజ్ చేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ మండలంలోని ప్రభుత్వ భూములు, కాలువలు, గుట్టలను ఎవరైనా కబ్జా చేస్తే స్థానికులు 94910 77028 నంబరుకు సమాచారం అందించాలని కోరారు. ఈ క్రమంలోనే అనుమతి లేకుండా గ్రావెల్, మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం సీజ్ చేసిన వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

పారదర్శకంగా ఓట్ల లెక్కింపు



మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : పారదర్శకంగా ఓట్ల లెక్కింపునకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల అధికారి మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు రాజకీయ పార్టీలు సహకారం అందించాయన్నారు. ఇదేవిధంగా కౌంటింగ్ రోజున కూడా అందించాలని కోరారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రతి నియోజకవర్గానికి 14 టేబుల్స్ ఉంటాయని వెల్లడించారు. జూన్ 4వ తేదీన ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. ఏజెంట్ల నియామకం త్వరతిగతిన పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ నెల 28వ తేదీన జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో కౌంటింగ్ సిబ్బందికి మొదటి విడత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. జూన్ 3వ తేదీన అబ్జర్వర్‌ల సమక్షంలో రెండో విడత శిక్షణ ఉంటుందని చెప్పారు. ఈ క్రమంలోనే కౌంటింగ్ కేంద్రం వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఓట్ల లెక్కింపు, ఇతర విధులకు 20 మందిని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా నియమించామని వివరించారు. అనంతరం కౌంటింగ్ ప్రక్రియపై అవగాహన కల్పించారు. సమావేశంలో చిత్తూరు ఆర్‌ఓ శ్రీనివాసులు, డీఆర్‌ఓ పుల్లయ్య, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉదయ్‌కుమార్, సురేంద్ర, అట్లూరి శ్రీనివాసులు, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

కట్టుదిట్టంగా కౌంటింగ్ ఏర్పాట్లు

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌కు కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్ తెలిపారు. జూన్ 4వ తేదీన నిర్వహించే ఓట్ల లెక్కింపు ప్రక్రియపై న్యూఢిల్లీ నుంచి కేంద్ర ప్రధాన ఎన్నికల అధికారి రాజీవ్ కుమార్ సోమవారం జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కౌంటింగ్ ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్ వివరించారు. ఎన్నికల సంఘం నిబంధనలు పాటిస్తూ పక్కాగా పనులు పూర్తి చేస్తున్నామని వెల్లడించారు. ఓట్ల లెక్కింపునకు సిబ్బంది కొరత లేకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద ఓట్ల లెక్కింపు రోజున క్రౌడ్ మేనేజ్‌మెంట్ విషయంలో అప్రమత్తంగా ఉంటామని తెలిపారు. ఎన్నికల సంఘం జారీ చేసిన పాస్ ఉంటేనే కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతిస్తామని చెప్పారు. నిరంతరాయంగా విద్యుత్, ఇంటర్ నెట్ సౌకర్యం ఉండేలా చర్యలు తీసుకున్నామన్నారు. పటిష్ట పోలీసు బందోబస్తు కల్పించామని, అత్యవసర ఆరోగ్య సేవలకు అంబులెన్సులను అందుబాటులో ఉంచుతున్నట్లు వివరించారు.కౌంటింగ్‌పై అధికారులకు, సిబ్బందికి ముందస్తు శిక్షణ ఇస్తున్నామని వెల్లడించారు. ఓట్ల లెక్కింపు పూర్తి అయిన వెంటనే ఈవీఎంలపై లెక్కింపు పూర్తి అయిందని రాసి స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరుస్తామని తెలిపారు. ఎన్నికల ఫలితాలను ఆలస్యం చేయకుండా ఎప్పటికప్పుడు నోటీసు బోర్డులో ప్రకటించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. కాన్ఫరెన్స్‌లో చిత్తూరు అసెంబ్లీ ఆర్‌ఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ట్యాంకుల క్లోరినేషన్ తప్పనిసరి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా తాగునీటి ట్యాంకుల క్లోరినేషన్ తప్పనిసరిగా పూర్తి చేయాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ అకాల వర్షాలు, రుతుపవనాల ప్రభావంతో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. సీజనల్ వ్యాధులపై క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో నీటి సరఫరాకు సంబంధించి 6,400 స్కీమ్‌లు ఉన్నాయన్నారు. చిత్తూరు నగరపాలక సంస్థలో నీటి సరఫరా వ్యవస్థపై ప్రత్యేక దృష్టి పెట్టాలని స్పష్టం చేశారు. దోమలు వ్యాప్తిని అరికట్టేందుకు క్రమం తప్పకుండా ఫాగింగ్ చేయించాలని కోరారు. ప్రతి శుక్రవారం డ్రై డే నిర్వహించాలని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా నీటి సరఫరా వనరులను పరిశీలించి జూన్ 3వ తేదీ లోపు నివేదికలు పంపాలని సూచించారు. ఆరోగ్య కేంద్రాల్లోని సమస్యలను గుర్తించి నివేదికలను అందజేయాలని ఆదేశించారు. సమావేశంలో చిత్తూరు నగర పాలక కమిషనర్ అరుణ, డీఎంహెచ్‌ఓ ప్రభావతీదేవి, జిల్లా మలేరియా అధికారి శ్రీనివాస్, టీబీ నివారణ అధికారి వెంకటప్రసాద్ పాల్గొన్నారు.

మాతా శిశు మరణాల నివారణే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా మాతా శిశు మరణాల నివారణే లక్ష్యంగా పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా మాతృమరణాల కమిటీ, వైద్యశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతల మరణాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విధుల పట్ల వైద్యాధికారులు అలసత్వం వహిస్తే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు. సర్కారు ఆస్పత్రుల్లో నాణ్యమైన వైద్యం అందించాలని స్పష్టం చేశారు. ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు గ్రామస్థాయిలో నిరంతరం పర్యటించి గర్భిణులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని కోరారు. ఏరియా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. ఆస్పత్రుల్లో మందులు లేవని, ప్రైవేట్ డాక్టర్లు, ప్రైవేట్ మెడికల్ స్టోర్లకు పంపితే సహించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. డ్యూటీ సమయంలో వైద్యులు, సిబ్బంది అందుబాటులో లేరని ఫిర్యాదు వస్తే సస్పెండ్ చేయడం ఖాయమని హెచ్చరించారు. అనంతరం జిల్లాలో మాతృమరణాలపై సమీక్షించారు. సమావేశంలో డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ ప్రభావతీదేవి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి రవిరాజు, కమిటీ సభ్యులు భువనేశ్వరి, ఉష శ్రీ, లత, సురేఖ, అమరనాథ్ పాల్గొన్నారు.

నాణ్యతతో మధ్యాహ్నభోజనం

చిత్తూరు కలెక్టరేట్ : సర్కారు బడుల్లో విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్నభోజనం వడ్డించాలని డీఈఓ దేవరాజు ఆదేశించారు. సోమవారం చిత్తూరు నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లోపనిచేసే వంట కార్మికులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పాటించాల్సిన నియమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎంఈఓలు సెల్వరాజ్, మోహన్ తెలియజేశారు. డీఈఓ మాట్లాడుతూ ప్రభుత్వం పేద విద్యార్థుల ఉన్నతి కోసం అధికంగా నిధులు ఖర్చు చేస్తోందన్నారు. రోజుకొక మెనూను సర్కారు బడుల్లో అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. మెనూ అమలు విషయంలో ఎలాంటి అలసత్వం ప్రదర్శించకూడదని స్పష్టం చేశారు. అనంతరం వంట కార్మికులకు వంటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన ఎంపీయూపీఎస్ మంగసముద్రం (ప్రథమ), బీఎస్‌ఆర్ పేట జెడ్పీ హైస్కూల్ (ద్వితీయ), గాండ్లపల్లె మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ (తృతీయ) వంట కార్మికులకు బహుమతులు అందజేశారు.కార్యక్రమంలో ఎంఈఓలు రామానాయక్, గణపతి, కణ్ణన్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తులసీబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఈఓ దేవరాజు

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఏఎన్‌ఎం మృతి


వరలక్ష్మి (ఫైల్)

తవణంపల్లె : మండలంలోని మత్యం క్రాస్ సమీపంలోని జయనగర్ వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏఎన్‌ఎం మృతి చెందింది. వివరాలు.. పట్టపల్లెకు చెందిన వరలక్ష్మి సరకల్లు సచివాలయంలో ఏఎన్‌ఎంగా విధులు నిర్వర్తిస్తోంది. తన భర్త మధుతో కలిసి బైక్‌పై తవణంపల్లెకు వస్తుండగా ప్రమాదం జరిగింది. మార్గం మధ్యలో కుక్క అడ్డురావడంతో కింద పడిపోతానేమో అనే భయంతో వరలక్ష్మి బైక్ నుంచి దిగేసింది. దీంతో తల రోడ్డుకు కొట్టుకుని తీవ్రంగా గాయపడింది. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలిస్తుండగా మరణించింది. ఆమె భర్త మధుకు మాత్రం ఎలాంటి గాయాలు కాలేదు. ఈ మేరకు తవణంపల్లె పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

గుంతలో స్నానానికి దిగి వ్యక్తి మృతి


మురుగేష్ (ఫైల్)

పెద్దపంజాణి : మండలంలోని బసవరాజు కండ్రిగలో స్నానానికి ఓ గుంతలో దిగిన వ్యక్తి మృత్యువాత పడిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాలు.. పుంగనూరులోని మంగళం కాలనీకి చెందిన సీకే మురుగేష్ (40) స్థానికంగా టమాట మండీ నిర్వహిస్తున్నాడు. ఆయనకు భార్య, నలుగురు పిల్లలు ఉన్నారు. బసవరాజు కండ్రిగలో గంగజాతర చూసేందుకు సమీప బంధువైన విక్రమ్ ఇంటికి కుటుంబంతో కలిసి వచ్చాడు. అమ్మవారి నిమజ్జనం అయిన తర్వాత స్నానం చేసేందుకు విక్రమ్‌కు చెందిన నీటి గుంత వద్దకు కుటుంబసమేతంగా వెళ్లాడు. గుంతలోకి దిగిన మురుగేష్ ఎంతకీ పైకి రాలేదు. కుటుబసభ్యులు కేకలు వేయడంతో గ్రామస్తులు అక్కడకు చేరుకుని గుంతలో గాలింపు చర్యలు చేపట్టారు. దీనిపై సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది రెడ్డెప్ప, అరున్ గుంతలోకి దిగి మురుగేష్ మృతదేహాన్ని వెలికి తీశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తానొకటి తలిస్తే.. విధిఒకటి తలుస్తుందన డానికి ఇదే నిలువెత్తు నిదర్శనం. భార్యకు మెరుగైన వైద్యం అందించేందుకు కారులో తమిళనాడుకు బయలుదేరిన కుటుంబాన్ని డ్రైవర్ కునుకు రూపంలో మృత్యువు కబళించింది. నలుగురిని శాశ్వత నిద్రలోకి నెట్టేసింది. అసలే అనారోగ్యంతో బాధపడుతున్న ఆ అభాగ్యురాలిని మృత్యువు అంచుకు చేర్చింది. కాళ్లు రెండూ విరిగిపోయి విలవిల్లాడుతూ భర్త పడుతున్న బాధ చూపరులను కలచివేస్తోంది. ఈ ఘటన చంద్రగిరి మండలంలో సోమవారం తెల్లవారు జామున తీవ్ర విషాదం నింపింది.


నుజ్జునుజ్జయిన కారు ముందు భాగం


డ్రైవర్ సమీర్ మృతదేహం కారులో ఇరుక్కుపోవడంతో క్రేన్ సాయంతో వెలికి తీసేందుకు యత్నిస్తున్న సీఐ రామయ్య

మృత్యు నిద్ర

ఎం.కొంగరవారిపల్లె సమీపంలో ఘోర రోడ్డు ప్రమాదం

- డివైడర్‌ను ఢీకొట్టిన కారు
- నలుగురు మృతి
- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- డ్రైవర్ అతివేగం, నిద్రమత్తే కారణం
- మృతులంతా
- మృతులంతా నెల్లూరు జిల్లాకు చెందిన వారే

చంద్రగిరి: కారు డ్రైవర్ కునుకు నలుగురి ప్రాణాలు తీసింది. మరో ఇద్దరిని ఆస్పత్రి పాలు చేసింది. ఈ ఘటన పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి ఎ.కొంగరవారిపల్లి సమీపంలో సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. నెల్లూరు జిల్లా, ఇందుకూరిపేట మండలం, నరసాపురం గ్రామానికి చెందిన ఆడిగోపుల శ్రీనివాసులు, నీరజ దంపతులు. తన భార్య గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆమెకు మెరుగైన వైద్యం అందించేందుకు భర్త శ్రీనివాసులు ఆదివారం రాత్రి అదే గ్రామానికి చెందిన సురేంద్ర వద్ద ఏపీ26బీహెచ్ 3435 హ్యుందాయ్ క్రేటా కారును తీసుకున్నాడు. ఆపై డ్రైవర్ సహాయంతో సోమవారం తెల్లవారుజామున ఒంటి గంట సమయంలో తమిళనాడు రాష్ట్రం, వేలూరు సీఎంసీకి బయలుదేరాడు. తోడుగా సోదరుడు శేషయ్య, ఆయన భార్య జయంతి వచ్చారు. మార్గమధ్యంలో మనుబోలు వద్ద నీరజ తల్లి పద్మావతమ్మను కారులో ఎక్కించుకున్నారు.

మరో గంటలో ఆస్పత్రికి

మరో గంటలో వేలూరు సీఎంసీకి చేరుకుంటారనగా.. ఇంతలో ఒక్కసారిగా వారిని మృత్యువు కబళించింది. డ్రైవర్ సమీర్(26) నిద్రలోకి జారుకోవడంతో రహదారి పక్కనే ఉన్న డివైడర్‌ను కారు అతివేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు డ్రైవరు సమీర్‌తో పాటు శేషయ్య(49), ఆయన భార్య జయంతి(42), పద్మావతమ్మ(58) అక్కడికక్కడే మృతి చెందారు. కారు వెనుక భాగంలో కూర్చున్న శ్రీనివాసులు, నీరజ తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న సీఐ రామయ్య తన సిబ్బందితో హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు.

నీరజ పరిస్థితి విషమం

క్షతగాత్రులు శ్రీనివాసులు, నీరజ తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. కాగా నీరజకు బలమైన గాయాలు తగిలాయి. ఊపిరితిత్తుల్లో రక్తం గడ్డకట్టినట్టు అక్కడి వైద్యులు నిర్ధారించారు. పరిస్థితి విషమంగా ఉందన్నారు. శ్రీనివాసులు తలకు తీవ్ర గాయం కావడంతోపాటు, కాళ్లు రెండూ విరిగిపోయాయి. ఈ మేరకు వారికి మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు వైద్యాధికారులు తెలిపారు.

మృతదేహాల అప్పగింత

ప్రమాదంలో మృతి చెందిన పద్మావతమ్మ, శేషయ్య, జయంతి, డ్రైవరు సమీర్ మృతదేహాలకు వైద్యాధికారులు సోమవారం సాయంత్రం పోస్టుమార్టాన్ని పూర్తిచేసి ప్రత్యేక వాహనంలో నెల్లూరుకు తరలించారు. అనంతరం వాటిని ఇందుకూరిపేటలోని స్వగ్రామానికి తరలించనున్నట్లు పోలీసులు తెలిపారు.

మిన్నంటిన రోదనలు

రుయా ఆస్పత్రి ప్రాంగణం శ్రీనివాసులు, నీరజ బంధువుల రోదనలతో మార్మోగింది. అన్నకు తోడుగా వెళ్లిన సోదరుడు శేషయ్య, ఆయన భార్య జయంతి మృతి తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించింది. వారి కుటుంబీకులు గుండెలు బాదుకుంటూ.. ఆర్తనాదాలు చేయడం అక్కడి వారిని కలచివేసింది. క్షతగాత్రులు, మృతులు ఒకే కుటుంబానికి చెందిన వారు కావడంతో చూపరుల కళ్లు చెమర్చేలా చేసింది.

కారులో ఇరుక్కుపోయిన మృతదేహాలు

కారు డివైడర్‌ను ఢీకొని, అక్కడే ఉన్న కాలువలో ఇరుక్కుపోయింది. మృతదేహాలను వెలికితీయడం కష్టతరంగా మారింది. పోలీసులు ఎంత శ్రమించినా ఫలితం లేకుండా పోయింది. చివరకు క్రేన్ సహాయంతో సుమారు రెండు గంటల పాటు శ్రమించి కారును సర్వీసు రోడ్డుపై ఉంచి.. గడ్డపారలతో అతికష్టం మీద మృతదేహాలను అధికారులు బయటకు తీశారు.

విడిపోయిన ఇంజిన్ భాగాలు

అతి వేగంగా డివైడర్‌ను కారు ఢీకొనడంతో కారు ముందు భాగంలోని ఇంజిన్‌తో పాటు ఇతర విడి భాగాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. ఇంజిన్ మొత్తం కారు నుంచి విడిపోయి డివైడర్ ముందు కాలువలో పడిపోయింది. కారులోని బ్యాటరీ సుమారు 40 అడుగుల దూరంలో పడిపోవడం చూస్తుంటే కారు ఎంత వేగంగా వెళ్లిందో అంచనా వేయవచ్చు.


చెల్లాచెదురుగా పడి ఉన్న కారులోని ఇంజిన్, ఇతర విడిభాగాలు


గడ్డపార సాయంతో మృతదేహాలను బయటకు తీసేందుకు యత్నిస్తున్న పోలీసు సిబ్బంది


మృతి చెందిన పద్మావతమ్మ, శేషయ్య, జయంతి, సమీర్ మృతదేహాలకు పంచనామా నిర్వహిస్తున్న అధికారులు


ప్రమాదంలో తీవ్రంగా గాయపడి తిరుపతి రుయాలో చికిత్స పొందుతున్న శ్రీనివాసులు, ఆయన సతీమణి నీరజ

నిద్రమత్తే కారణం



కారు సోమవారం తెల్లవారు జామున సుమారు 5.40 గంటలకు ఎం.కొంగరవారిపల్లి వద్దకు చేరుకుంది. ఆ సమయంలో డ్రైవరు నిద్రమత్తులోకి జారుకోవడంతోనే ఈ ప్రమాదం చోటుచేసుకుని ఉండవచ్చు. డివైడర్‌ను ఢీకొన్న సమయంలో ప్రమాదాన్ని తప్పించేందుకు డ్రైవరు కనీసం బ్రేకులు కూడా ఉపయోగించిన ఆనవాళ్లు లేవు.

– రామయ్య, చంద్రగిరి సీఐ

అలరించిన 'ఇలావంతుని బలి'

- వైభవంగా ద్రౌపదీ సమేత ధర్మరాజస్వామి ఉత్సవాలు
- ఆకట్టుకున్న నాటక ప్రదర్శనలు


ఇలావంతుని బొమ్మ వద్ద బలి కార్యక్రమం

గుడుపల్లె : మండలంలోని యామగానిపల్లెలో వైభవంగా ద్రౌపదీ ధర్మరాజ స్వామి ఉత్సవాలు సాగుతున్నాయి. అందులో భాగంగా సోమవారం నిర్వహించిన ఇలావంతుని బలి కార్యక్రమం అలరించింది. ఈ ప్రదర్శన సందర్భంగా ఆలయం సమీపంలో ఇలావంతుని బొమ్మను ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. బలి కార్యక్రమం పూర్తి చేసి పాండవుల ఆయుధాలకు విశేష పూజలు నిర్వహించారు. ఆకట్టుకునే ప్రదర్శనలను వీక్షించేందుకు పెద్దసంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. రాత్రి ఆలయం చుట్టూ అమ్మవారిని మంగళవాయిద్యాల నడుమ ప్రదక్షిణ చేయించారు. అనంతరం ప్రదర్శించిన శ్రీకృష్ణరాయబారం నాటకం భక్తులను ఆకట్టుకుంది.

నేడు అగ్నిగుండ ప్రవేశం

ధర్మరాజస్వామి ఉత్సవాలు మంగళవారంతో పరిపూర్ణం కానున్నాయి. ఈ సందర్భంగా ఆలయం వద్ద సాయంత్రం దుర్యోధన వధ, రాత్రి అగ్నిగుండ ప్రవేశం నిర్వహించనున్నారు.

లారీని ఢీకొన్న బైక్

- యువకుడి మృతి
- మరొకరికి తీవ్రగాయాలు

మనుబోలు(నెల్లూరు జిల్లా): లారీని మోటార్ బైక్ ఢీకొని ఓ యువకుడు మృతిచెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన మండలంలోని వీరంపల్లి క్రాస్‌రోడ్డు వద్ద సోమవారం జరిగింది. కుప్పం నియోజకవర్గం, నాయునూరుకు చెందిన బి.బాబు కుమారుడు బి.కార్తీ (20), తమిళనాడు కృష్ణగిరికి చెందిన జయరాం కుమారుడు జె.అరవింద్ బైక్‌పై నెల్లూరు నుంచి చెన్నైకి వెళ్తున్నారు. మండల పరిధిలోని వీరంపల్లి క్రాస్‌రోడ్డు వద్ద పొదలకూరు వైపు నుంచి వచ్చిన లారీ హైవేకి తూర్పున ఉన్న వే బ్రిడ్జ్ వద్ద వెళ్లేందుకు రోడ్డు దాటుతోంది. అదే సమయంలో వేగంగా వచ్చిన బైక్ లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు గుర్తించి వారిని వెంటనే చికిత్స నిమిత్తం నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ కార్తీ మృతి చెందాడు. అరవింద్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. సమాచారం అందుకున్న మనుబోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'జైన్ ఫార్మ్'లో ఐఎఫ్‌సీ బృందం


ఐఎఫ్‌సీ బృందంతో జైన్ కంపెనీ ప్రతినిధులు

గంగాధర నెల్లూరు : జీడీనెల్లూరు పంచాయతీలోని జైన్ ఫార్మ్ ఫ్రెష్ ఫుడ్స్ మామిడి గుజ్జు పరిశ్రమను సోమవారం (అంతర్జాతీయ ఫ్రూట్ యూనియన్) ఐఎఫ్‌సీ బృందం సందర్శించింది. కంపెనీ మేనేజర్ షమీర్ శర్మ ఆధ్వర్యంలో బెంగళూరులో నిర్వహించనున్న సమావేశంలో పాల్గొనేందుకు విచ్చేసిన ఐఎఫ్‌సీ అధ్యక్షుడు కీస్ కూల్స్, వారి బృందాన్ని జైన్ ఫార్మ్ గుజ్జు పరిశ్రమ ప్రతినిధులు కలిసి జిల్లాకు రావాలని ఆహ్వానించారు. ఈ మేరకు వచ్చిన ఐఎఫ్‌సీ బృందానికి మంగళ వాయిద్యాలతో స్వాగతం పలికారు. భారతీయ సాంప్రదాయ వంటలు రుచి చూపించారు. అనంతరం బృందం వారు గుజ్జు పరిశ్రమలను సందర్శించి, రైతులతో సమావేశమయ్యారు. వారి సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో జైన్ కంపెనీ సీఈఓ సువాంత్ శర్మ, క్యూఏ హెడ్ సునీల్ గుప్తా, ఆపరేషన్ హెడ్ రోషన్ షా పాల్గొన్నారు

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరి

చిత్తూరు అర్బన్: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలని ఎస్పీ మణికంఠ స్పష్టం చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రతా నియమావళి మేరకే వాహనం నడపాలని స్పష్టం చేశారు. మైనర్లకు వాహనం ఇస్తే తల్లిదండ్రులకు శిక్ష తప్పదని హెచ్చరించారు. రూ.25వేల జరిమానాతోపాటు 3 ఏళ్ల జైలు శిక్ష ఉంటుందని వెల్లడించారు. జూన్ 1వ తేదీ నుంచి ట్రాఫిక్ రూల్స్‌ను పకడ్బందీగా అమలు చేయనున్నట్లు తెలిపారు.

ఏనుగుల దాడిలో పంటల ధ్వంసం


రాలిపోయిన టమాటాలను చూపుతున్న రైతు

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని వెంకటదాసరపల్లె పంచాయతీలోని పంటలను సోమవారం వేకువ జామున ఏనుగులు ధ్వంసం చేశాయి. చేతికొచ్చే దశలలోని టమాట పంటలను నాశనం చేశాయి. మంచి ధర వస్తున్న తరుణంలో పంట నష్టపోయామని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటవీశాఖ అధికారులు తగు చర్యలు తీసుకుని పంటలను ఏనుగుల బారి నుంచి కాపాడాలని కోరుతున్నారు.

విశ్వం స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ


స్టడీ మెటీరియల్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ, అపుస్మా రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి వరదరాజ నగర్‌లోని విశ్వం విద్యాసంస్థలో సోమవారం విశ్వం సైనిక్, నవోదయ ప్రవేశ పరీక్షల స్టడీ మెటీరియల్స్‌ను ఎమ్మెల్సీ, అపుస్మా రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ.రామచంద్రరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 సైనిక్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకుతో పాటు 60కిపైగా సీట్లను, నవోదయ ఫలితాల్లో 57 సీట్లు సాధించడం అభినందనీయమన్నారు. విశ్వం విద్యాసంస్థల్లో సైనిక్, మిలిటరీ, నవోదయ తదితర పోటీ పరీక్షల్లో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారని కొనియాడారు. జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధిస్తున్న విశ్వం విద్యాసంస్థ అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డిని అభినందించారు. అనంతరం విశ్వం విద్యాసంస్థ అధినేత ఎన్.విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ గడిచిన 34 ఏళ్లలో సైనిక్ ఫలితల్లో 41 రాష్ట్ర స్థాయి ప్రథమ ర్యాంకులతో పాటు 910 సీట్లు సాధించినట్టు వెల్లడించారు. పోటీ పరీక్షలకు సంబంధించి పూర్తి సమాచారానికి 86888 88802, 93999 76999 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు. విశ్వం విద్యాసంస్థ అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, కరస్పాండెంట్ ఎన్.తులసీ విశ్వనాథరెడ్డి, అపుస్మా రాష్ట్ర నాయకులు సంజీవరెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, పుల్లయ్య పాల్గొన్నారు.